క్లుప్తంగా

క్షత్రియ యూత్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రి పంపిణీ



క్షత్రియ యూత్ ఫెడరేషన్ అందించిన విద్యాసామగ్రితో పదో తరగతి విద్యార్థులు

భీమవరం: క్షత్రియ యూత్ ఫెడరేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమం భాగంగా అల్లూరి సీతారామరాజు జ్ఞాపకార్థం పదో తరగతి విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేసినట్లు క్షత్రియ యూత్ తెలిపింది. శనివారం పాలకోడేరు మండలం మోగల్లు, భీమవరం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షల ప్యాడ్, జామెట్రీ బాక్స్, పెన్స్, బిస్కెట్ ప్యాకెట్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికే లోక్ అదాలత్

భీమవరం: కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని భీమవరం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) బి. అప్పల స్వామి సూచించారు. ఈ నెల 16 న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి క్రిమినల్ కేసులు, రెవెన్యూ, మున్సిపల్ కేసులు పై రాజీకి తీసుకున్న చర్యలపై సమీక్షా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో ఆయన మాట్లాడుతూ సుమారు 400 రాజీ చేయడానికి వీలున్న క్రిమినల్ కేసులను గుర్తించినట్లు తెలిపారు. డీఎస్పీ పీ.వీ. నారాయణస్వామి రెడ్డి, ఆకివీడు ప్లానింగ్ అధికారి రాధా కృష్ణ, రూరల్ ఇన్‌స్పెక్టర్ వై.సత్య కిషోర్, ఏజీపీ వరప్రసాద్ పాల్గొన్నారు.

99 శాతం ఈకేవైసీ పూర్తి

భీమవరం: దాళ్వా సీజన్‌లో జిల్లాలో 2.22 లక్షల ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు చేయగా సుమారు 99 శాతం రైతుల ఈకేవైసీ పూర్తి చేసినట్లు జిల్లా వ్యవసాయశాఖాధికారి జెడ్ వెంకటేశ్వరరావు చెప్పారు. అన్ని ఆర్‌బీ కేల్లో సామాజిక తనిఖీల్లో భాగంగా ఈ క్రాప్ జాబితాను ఏర్పాటు చేసినట్లు తెలి పారు. అభ్యంతరాలుంటే ఆర్‌బీకే సిబ్బందికి తెలియజేయాలని వెంకటేశ్వరరావు తెలిపారు. ఈనెల 5 లోపు తుది జాబితా వెలువడుతుందని అన్నారు.

వెండి కిరీటం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్):శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రేశ్వర స్వామి దేవస్థానం గునుపూడి భీమవరం నందు వేంచేసియున్న శ్రీ భద్రకాళీ అమ్మవారికి శనివారం దాతలు కొప్పరావూరి సుబ్రహ్మణ్యం - కనకదుర్గ దంపతులు వారి కుటుంబ సభ్యులచే అమ్మవారికి అర కేజీ సుమారు 50,000 విలువ గల వెండి కిరీటం సమర్పించారు. వారికి ఆలయ కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

డైలీ మార్కెట్‌లో ఆశీల వసూలుకు వేలం

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని ఆశీల వసూళ్లకు శనివారం వేలం నిర్వహించారు. నగర పంచాయతీ కమిషనర్ జీ కృష్ణ మోహన్ ఆధ్వర్యంలో ఆశీల వేలం పాట నిర్వహించగా డైలీ మార్కెట్ పాట రూ. 80,82,000 వెళ్లింది. గతేడాది కంటే అత్యధికంగా చెల్లించేలా పుప్పాల గంగాధరరావు(చిన్నా) వేలం దక్కించుకున్నారు. వారపు సంత వేలంపాటను రూ. 3,25,300కు షేక్ అమీర్, కబేళాలో ఆశీల వసూలుకు సంబంధించి షేక్ చంటి సాహెబ్ రూ.33 వేలకు వేలం దక్కించుకున్నారు. నగర పంచాయతీ మంచినీటి చెరువుల వద్ద, ఇతర ప్రాంతాల్లోని కొబ్బరి చెట్లు, పంచాయతీ షాపుల వేలం పాటను గురువారానికి వాయిదా వేసినట్లు కమిషనర్ కృష్ణమోహన్ వివరించారు. ఈ వేలం నగర పంచాయతీ మేనేజర్ వెంకటేశ్వరరావు నిర్వహించారు.

పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం

భీమవరం: ఉద్యోగులు కార్మికుల సమస్యలు పరిష్కారం ఐక్య పోరాటాల ద్వారా సాధ్యపడుతుందని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జెఎన్వీ గోపాలన్, కె రాజారామ్మోహన్ రాయ్ అన్నారు. శనివారం భీమవరంలో నిర్వహించిన సీఐటీయూ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు నష్టం చేసే చట్టాలు చేస్తున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పిలుపు ఇచ్చారు. సీఐటీయూ నాయకులు బి వాసుదేవ రావు, పివి ప్రతాప్ పాల్గొన్నారు.

వరకట్నం వేధింపులపై కేసు

పాలకోడేరు: ఇచ్చిన కట్నం చాల లేదని, ఇంకా అదనపు కట్నం కావాలని తన భర్త తనను భౌతికంగా, మానసికంగా వేధిస్తున్నాడని భర్త అన్నయ్య కూడా భర్తకు సహకరిస్తున్నాడంటూ గోరగనమూడి కి చెందిన ముప్వా తనూష శుక్రవారం పాలకోడేరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాళ్ళ మండలం బొండాడపేటకు చెందిన ముప్వా రమేష్‌తో 2021లో వివాహమైందని, కొంతకాలంగా అనారోగ్యం పేరుతో దూరంగా ఉంటున్నాడని ఫిర్యాదులో ఆమె పేర్కొంది. ఇటీవల అదనపు కట్నంతో పాటు రెండు సెంట్ల స్థలం తనకు రాసివ్వాలని నిత్యం వేధిస్తుండడంతో శనివారం పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త బావలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

పేదల సొంతింటి కల సాకారం

- నియోజకవర్గ ప్రజలే నా కుటుంబం
- ఇళ్ల పట్టాల పంపిణీ సభలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్
- 6,347 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలు అందజేత



వీరవాసరం: ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విప్ , ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, చిత్రంలో కవురు శ్రీనివాస్



భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరంలో ఇళ్ల పట్టాలతో మహిళలు

భీమవరం (ప్రకాశం చౌక్) : భీమవరం నియోజకవర్గ ప్రజలే నా కుటుంబం, వారి చిరునవ్వే నా పని తీరుకు నిదర్శనంగా భావిస్తూ పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అమలు చేయడం సంతృప్తినిస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం లూథరన్ గ్రౌండ్‌లో శనివారం భీమవరం పట్టణం, భీమవరం మండలంలోని ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రంధి శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా చరిత్రలో నిలుస్తారని అన్నారు. పేదలకు నేడు లక్షల విలువ చేసే ఇంటి స్థలాన్ని ఆస్తిగా సర్వ హక్కులతో రిజిస్ట్రేషన్ చేసి అందజేయడంతో పాటు ఇల్లు నిర్మించి వారి కలను నేరవేర్చామన్నారు. ఇంటి స్థలం పేదలకు అన్ని విధాలుగా ఉపయోగపడేలా భవిష్యత్‌లో స్థలం విలువ పెరిగే విధంగా పట్టాను లబ్ధిదారుని పేరిట పక్కాగా రిజిస్ట్రేషన్ చేసి అందజేస్తున్నామన్నారు. పేదలకు మేలు చేసే గృహనిర్మాణ పథకాన్ని అడ్డుకునేందుకు చంద్రబాబు కోర్టుల్లో కేసులు వేసి కుట్రలు పన్నారని విమర్శించారు.

భూమి సేకరణ కోసం ఎంతో శ్రమించాను

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం కోసం అభివృద్ధి చెందిన భీమవరం ప్రాంతంలో భూముల సేకరణ కోసం ఏంతో శ్రమించాల్సి వచ్చిందని ఎమ్మెల్యే అన్నారు. పేదలకు మంచి జరుగుతుందని, నాపై అభిమానంతో రైతులు ముందుకు వచ్చి భూములు ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వ సహకారంతో దాదాపు 200 ఎకరాల భూమి సేకరించి నియోజకవర్గంలో వేలాది మందికి ఇంటి స్థలాలు కేటాయించామని అన్నారు. గతంలో తాడేరు రోడ్డులో 11 ఎకరాల భూమిని సేకరించి 700 ఇళ్లు నిర్మించినట్టు గుర్తు చేశారు. వైఎస్సార్ ప్రోత్సాహంతో నాడు 82 ఎకరాల భూమి సేకరించడం వల్లే టిడ్కో ఇళ్లను నిర్మించడం సాధ్యమైందని ఆయన తెలిపారు. హెడ్ వాటర్ వర్క్స్ సమీపంలో 120 ఎకరాలు భూమి సేకరించి అందులో 60 ఎకరాల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకర్ తవ్వించినట్టు తెలిపారు. మిగిలిన భూమిలో నేడు లబ్ధిదారులకు ఇంటి స్థలాలు కేటాయించామన్నారు. 100 పడకల ఆస్పత్రి ఏర్పాటుకు సంకల్పించి నాలుగు ఎకరాల భూమిని సొంతంగా కొనుగోలు చేసి ఇచ్చినట్టు తెలిపారు. గతంలో ప్రభుత్వ కళాశాలకు విలువైన 35 సెంట్ల భూమి ఇచ్చినట్టు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తెలిపారు.

రైతులను మోసం చేసిన అంజిబాబు

గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన అంజిబాబు వాటర్ స్కీం పేరిట తక్కువ ధరకే రైతుల నుంచి భూములు సొంతం చేసుకున్నాడని ఎమ్మెల్యే గ్రంది శ్రీనివాస్ విమర్శించారు. భీమవరం మండలం చినఅమిరంలో వాటర్ ప్రాజెక్టు వస్తోందని 50 ఎకరాల భూమి కావాలని, ప్రభుత్వం నుంచి పరిహారం రావడం ఆలస్యం అవుతుందని నమ్మబలికి తక్కువ ధరకే రైతుల నుంచి భూములు తన పేరిట రాయించుకున్నాడని ఆరోపించారు. అనంతరం ఆ భూములను చేపల చెరువుల చేసి లీజుకు ఇచ్చి రూ.లక్షల ఆదాయం అంజిబాబు అనుభవిస్తున్నట్టు తెలిపారు. వీరవాసం మండలంలో కూడా భూముల సేకరణకు ప్రయత్నిస్తే రైతులు అతని మోసాన్ని గుర్తించి వ్యతిరేకించారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తిని ఉద్దేశించి పవన్ కల్యాణ్ రాజకీయాల్లో మీలాంటి నాయకులు ఉండాలని సర్టిఫికెట్ ఇవ్వడం సిగ్గుచేటని అన్నారు. భీమవరం మండలానికి సంబంధించి 1,535 మంది, భీమవరం పట్టణానికి సంబంధించి 4,834 మంది లబ్ధిదారులకు మొత్తం 6,347 మందికి పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసుల రాజు, మున్సిపల్ కమిషనర్ ఎం. శ్యామల, ఎంపీపీ పేరిచర్ల నరసింహరాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసిహరావు, మేడిద జాన్సన్, తిరుమాని ఏడుకొండలు, తోట భోగయ్య, కామన నాగేశ్వరరావు, కోడే యుగంధర్, ఏఎస్‌రాజు, చినమిల్లి వెంకటరాయుడు, నల్లం రాంబాబు, చెల్లబోయిన సూర్యప్రకాష్, గంటా సుందర్‌కుమార్, పాలవెల్లి మంగ, కందికట్ల రేవూరి గోగురాజు, అడ్వర్డ్, గొట్టుముక్కల సత్యనారాయణరాజు, కొట్టి కుటుంబరావు, కొమటి రాంబాబు, కోళ్ల బాలకృష్ణ, కరీముల్లా భాషా, షేక్ రబ్బానీ,కొల్లి ప్రసాద్,అల్లూరి కృష్ణంరాజు, కలిదిండి బంగారురాజు, అల్లూరి రవికుమార్ రాజు, అల్లూరి నాగవల్లి, వేంద్ర విజయదుర్గ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌తోనే సాధ్యం

వీరవాసరం: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని 25 లక్షలకు పెంచి ప్రతి కుటుంబానికి ఆరోగ్య భద్రతను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం మండలంలో శనివారం ఇళ్ల స్థల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒకపక్క సంక్షేమాన్ని, మరో పక్క అభివృద్ధిని పెద్ద ఎత్తున అమలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాసు, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాల దుర్గా నాగమల్లేశ్వరరావు, జెసిఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్ కుమార్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కడలి ధర్మారావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గొలగాని సత్యనారాయణ, వీరవాసరం సర్పంచ్ చికిలే మంగతాయారు, గెడ్డం భారతి ,వీరవల్లి కనక ఉషారాణి ,బోను జ్యోష్ణ దేవి ,నేతల జ్ఞాన సుందర్రాజు, నూకల కనకారావు, కొలుపూరి గౌరీ, గెడ్డం భాస్కరరావు, బొంతు రమేష్, చవాకుల సత్యనారాయణ మూర్తి, మద్దాల సత్యనారాయణమూర్తి, కందుల సురేష్, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ,మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పాలకోడేరు: కోడలు ప్రవర్తన కారణంగా మానసికంగా కుంగిపోయి తన కుమారుడు తాతారావు ఇల్లు వదిలి వెళ్లిపోయాడని వేంద్రకు చెందిన బందెల చిట్టియ్య శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోడలు వేరే వ్యక్తితో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోవడంతో తాతారావు మానసికంగా గాయపడ్డాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. చిట్టియ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

కొట్టి గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదు

పాలకోడేరు: ఈనెల ఒకటవ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు తాను ఇంటిలో ఉండగా మోగల్లుకు చెందిన పెన్మెత్స సత్యనారాయణ రాజు తలుపు కొట్టి లోపలికి ప్రవేశించి చేతిలో ఉన్న వెదురు బొంగుతో తలపై, కాళ్లపై కొట్టి గాయపరిచినట్లు గొల్లలకోడేరుకు చెందిన వరదరాజు తెలిపారు. భీమవరంలోని ప్రైవేటు ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు హెడ్ కానిస్టేబుల్ అజరయ్య తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ఎస్ఐ జి రాజు తన సిబ్బందితో నరసింహపురం గ్రామ శివారులోని పేకాట శిబిరంపై దాడి చేశారు. ఈదాడిలో ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3150ల నగదును స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

గెలుపే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు కృషి చేయాలి



వైఎస్సార్ సీపీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న పీవీఎల్



సమావేశంలో పాల్గొన్న బూత్ ప్రెసిడెంట్లు, నాయకులు

- క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి
- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, పరిశీలకురాలు శ్రీలక్ష్మి

కాళ్ల: రాష్ట్రంలో రెండవసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని డీసీసీబీ చైర్మన్, పీవీఎల్ నరసింహరాజు, నియోజకవర్గ పరిశీలకురాలు పిళ్లంగోళ్ల శ్రీలక్ష్మి పిలుపునిచ్చారు. కాళ్ల మండలం పెద అమీరం పార్టీ క్యాంపు కార్యాలయంలో శనివారం బూత్ ప్రెసిడెంట్‌లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ బూత్ లెవెల్లో క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరు పార్టీ గెలుపునకు కృషి చేయాలని అన్నారు. ఇష్టంతో పని చేసి అప్పగించిన పనిని కృతనిశ్చయంతో పూర్తి చేసేందుకు సైనికుల్లా పనిచేయాలని కోరారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి ప్రభుత్వ పథకాలను వివరించి వారి మద్దతు కోరాలని సూచించారు. కష్టపడి పనిచేసిన వారిని పార్టీ గుర్తుంచుకుంటుందని తెలిపారు. రెండోసారి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రభుత్వం అందరికీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఉండి నియోజకవర్గంలో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని పీవీఎల్ నరసింహరాజు కోరారు. రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావటం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. ప్రతి బూత్ లెవెల్‌లో ప్రెసిడెంట్లు, వైస్ ప్రెసిడెంట్లు, వలంటీర్ల సహాయంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.రానున్న రోజుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు అవసరమయ్యే విధంగా మేనిఫెస్టో విడుదల చేస్తారని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటుకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సిద్ధం కావాలని కోరారు. ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, కాళ్ళ, పాలకోడేరు, ఉండి, మండలాల కన్వీనర్లు గణేశ్న రాంబాబు, కటిక శ్రీదేవి, పెనుమత్స ఆంజనేయరాజు, జేఏసీ కన్వీనర్లు వీరమల్లు గంగయ్య, రాధాకృష్ణ, సిరపు శ్రీను, రామకృష్ణ, అంబటి రమేష్, పుప్పాల పండు ధనుంజయ్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ



పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న మోషేన్‌రాజు తదితరులు

భీమవరం: గతించిన వారి పేరిట కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. భీమవరం 36వ వార్డు మాజీ కౌన్సిలర్ మున్సిపల్ వైస్ చైర్మన్ ములుగుర్తి వెంకట రామయ్య జ్ఞాపకార్థం కుమారుడు ములుగుర్తి సుధీర్ ఆధ్వర్యంలో 100 మంది, పేద వృద్ధులకు, వికలాంగులకు బియ్యం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మోషేన్‌రాజు పేదలకు బియ్యం పంపిణీ చేసి మాట్లాడారు. ఇటువంటి సేవా కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. వృద్ధులకు, వికలాంగులకు 5 కిలోల చొప్పున బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వాసర్ల ముత్యాలరావు, బేతల సంతోష్, ములుగుర్తి నాగేశ్వరరావు, యర్రా సర్వేష్, మజ్జిప్రసాద్, వరసాల చిన్న, గుత్తుల వేణు , దనిమిరెడ్డి సూర్య, వింజవరపు గోపి, ఇంజమూరి లాజర్, గొల్లపల్లి స్వామి, ములుగుర్తి చంటి, కావ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు చిన్నారులకు పోలియో చుక్కలు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్. వెంకట రమణ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక బి.ఆర్. అంబేద్కర్ సెంటరు వద్ద పల్స్ పోలియో ప్రచార ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ అంబేద్కర్ సెంటరు నుంచి ప్రకాశం చౌక్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం చేపట్టనున్న పల్స్ పోలియో వ్యాక్సిన్ 0-5 సంవత్సరాల చిన్నారులకు పోలియో చుక్కల మందును తప్పక వేయించాలన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లి, దండ్రులు మరింత చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డిఎంహెచ్‌ఓ డా.బాను నాయక్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి దేవసుధా లక్ష్మి, జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ యస్. కీర్తి కిరణ్, ఐసీడీఎస్ అధికారి బి.సుజాతా రాణి, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనరు చెరుకువాడ రంగ సాయి, వైద్యాధికారులు, పల్స్ పోలియో టాస్క్ ఫోర్స్ అధికారులు, వైద్య సిబ్బంది, స్వాతి నర్సింగ్ కాలేజ్ విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

పాలకోడేరు: సమాజాన్ని పోలియో రహిత దేశంగా తీర్చిదిద్దేందుకు అన్ని వర్గాలూ ముందుకు రావాలని పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చినమిల్లి వెంకట రంగమనాయుడు తెలిపారు. మండలంలో పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం నిర్వహిస్తున్నామని తెలిపారు. పాలకోడేరులో వైద్య సిబ్బంది, సూపర్‌వైజర్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ రంగామనాయుడు మాట్లాడుతూ పాలకోడేరు పీహెచ్‌సీ పరిధిలో 5 ఏళ్లలోపు చిన్నారులు 3,299 మంది ఉన్నారని వారికి పోలియో చుక్కలు వేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. గ్రామాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలు, కమ్యూనిటీ హాళ్ల వద్ద 32 బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. 150 మంది వైద్య సిబ్బందిని నియమించామని అన్నారు. పల్స్ పోలియో బూత్‌ల వద్ద ఆదివారం ఉదయం 7 నుంచి, సాయంత్రం 6 గంటల వరకూ సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ స్వర్ణ నిరంజని, డాక్టర్ లీలా లక్ష్మి, సీ హెచ్ ఓ సత్యనారాయణ, కుమారి, డ్వాక్రా ఏపీ ఎంఎం భారతి, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు లు కట్టా మాధవి, శారద, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పోలియో చుక్కలు వేయించాలి

భీమవరం అర్బన్: ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని పీహెచ్‌సీ వైద్యాధికారిని ఎ అరుణరాణి శనివారం తెలిపారు. ఆదివారం జాతీయ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమం ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు చెప్పారు. మండలంలో గొల్లవానితిప్ప పీహెచ్‌సీ పరిధిలో 31 పల్స్ పోలియో బూత్‌లు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు.



పల్స్ పోలియో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

20 రోజుల్లో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి



మండపాడులో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించిన డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

ఆకివీడు: మండపాడులో గడప గడపకు మన ప్రభుత్వ నిధులతో 20 రోజుల్లోనే మూడు సీసీ రోడ్లు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహరాజు చెప్పారు. గ్రామంలో రూ.7 లక్షల వ్యయంతో మూడు సీసీ రోడ్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించిన సందర్భంగా గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నంద్యాల కృష్ణ సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. వెంటనే నిధులు మంజూరు చేసి రోడ్ల నిర్మాణానికి గత నెల 10న భూమి పూజ చేసినట్లు చెప్పారు. మాజీ ఎంపీపీ గొట్టుముక్కల బాబ్జీరాజు, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు గాలి సామ్రాజ్యం మాట్లాడుతూ నర్సింహరాజు వచ్చే ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలవడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు నంద్యాల కృష్ణ, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

దళిత గర్జన కరపత్రాల ఆవిష్కరణ

భీమవరం: ఈనెల 9వ తేదీన భీమవరం అంబేడ్కర్ భవనం నందు దళిత గర్జన నిర్వహించనున్నట్లు మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ తెలిపారు. పట్టణంలోని మెంటే వారి తోట నందు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి చెన్నయ్య, ఆంధ్ర ప్రదేశ్ శాసనమండలి చైర్మన్ కొయ్య మోషన్ రాజు, ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ ,ఆంధ్ర ప్రదేశ్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ మేడిది జాన్సన్, ముఖ్యఅతిథిగా హాజరవుతారని పుష్ప రాజ్ తెలియజేశారు. అధిక సంఖ్యలో దళిత మేధావులు, ఉద్యోగులు, విద్యార్థి సంఘాలు, మహిళలు హాజరై దళిత గర్జన విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సంధి జయరాజు, జిల్లా అధ్యక్షుడు నేతల సువర్ణ రాజు, నేతల సాల్మన్ రాజు , పిట్టా వినోద్ కుమార్, గోర్ల గోపి, చిగురుపాటి రాజేష్, మేడిది సాయి జగన్నాథ్, తోర్లపాటి భాగ్యరాజ్, కేదాసి నాగరాజు, నల్లి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అధిక ఉత్తీర్ణత శాతాన్ని సాధించాలి



అనాకోడేరులో విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షలు బాగా రాసి జిల్లాల్లోనే అధిక ఉత్తీర్ణత సాధించాలని డీఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్ శాంత కుమారి అన్నారు. భీమవరం మండలంలోని అనాకోడేరు గ్రామంలో డీఎన్నార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డీఎన్నార్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ -2 ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు జామెంట్రీ బాక్స్‌లు, ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు తదితర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శాంతకుమారి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివితేనే భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ గూడపాటి మిల్టన్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ఎస్ అనిల్ దేవ్, ప్రధానోపాధ్యాయులు బి. వెంకటేశ్వర్లు, జి. రంగారావు, రేపాక వెంకన్న బాబు, వి. మెర్సీ నిర్మలాకుమారి, బి. రాధామణి, ఎన్. దుర్గా ప్రసాద్, కె. రాజేష్ కుమార్‌రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలపై అవగాహన ర్యాలీ

కాళ్ల: మండల మహిళా సమైక్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రకృతి వ్యవసాయం , క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల సభ్యులకు అవగాహన కల్పించారు. ఆదివారం జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని చెప్పారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని సూచనలు చేశారు. అనంతరం కాళ్ల సంత మార్కెట్ వద్ద ఎన్నికలపై అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం కే శ్రీనివాసరావు, సీసీలు మోహన్, పద్మజ, సుమలత, మండల సమైక్య అధ్యక్షురాలు మహాలక్ష్మి, కోశాధికారి సుజాత, గ్రామ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీ టెట్ పరీక్షకు 86 శాతం హాజరు

భీమవరం: జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాల్లో శనివారం నిర్వహించిన ఏపీ టెట్ పరీక్షకు 86 శాతం అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్ వెంకటరమణ చెప్పారు. పరీక్షకు మొత్తం 400 మంది అభ్యర్థులు హాజరుకావల్సి ఉండగా 345 మంది హాజరయ్యారన్నారు. రెండు స్పెషల్ స్క్వాడ్‌టీమ్ పరీక్షా కేంద్రాలను విజిట్ చేయగా ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని వెంకటరమణ తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

భీమవరం: జిల్లాలో శనివారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షలకు 97.7 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని ఆర్ఐవో కె చంద్రశేఖర్‌బాబు చెప్పారు. జిల్లా 50 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 13,763 మంది జనరల్ అభ్యర్థులకు గాను, 13,508 మంది హాజరుకాగా 1,437 మంది ఒకేషనల్ అభ్యర్థులకు 1,346 మంది హాజరయ్యారన్నారు. పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని చంద్రశేఖర్‌బాబు వివరించారు.

ఈ క్రాప్ జాబితా ప్రదర్శన

వీరవాసరం: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ఈ-క్రాప్ రబీ 2023-24 సంబంధించి రైతుల జాబితాను సోషల్ ఆడిట్ నిమిత్తం ఆర్‌బీకేలో అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయాధికారి బీన్సిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శనివారం విలేకర్లతో మాట్లాడుతూ రైతులు రైతు భరోసా కేంద్రాల దగ్గర ఉన్నటువంటి ఈ సోషల్ ఆడిట్ లిస్టును పరిశీలించుకుని వారి యొక్క వివరాలు సరి చూసుకోవాలన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే ఆర్బీకేలో గ్రామ వ్యవసాయ సహాయకుల్ని సంప్రదించాలన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

భీమవరం అర్బన్: ఓటు హక్కు వినియోగం ద్వారా ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని, దీనికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్ తెలిపారు. భీమవరం మండలంలోని రాయలం గ్రామంలో స్వీప్‌పై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్ మాట్లాడుతూ ఓటుకు నోటు, ప్రలోభాలకు దూరంగా ఉండి ఓటు హక్కును వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యాన్ని కాపాడవచ్చన్నారు. కొంతమంది చదువుకున్న ఓటు హక్కును వినియోగించుకోకపోవడంతో తక్కువ శాతం నమోదవుతుందన్నారు. గత ఎన్నికల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 82 శాతం నమోదు అయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంఎస్ ప్రసాద్, మండల ఏపీఎం వై. వేణుగోపాలరావు, సీసీలు పాల్గొన్నారు.